మహిళా మోర్చా ఆధ్వర్యంలో 'శక్తివందన్ అభియాన్'

కార్యక్రమంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 4 : నగరంలోని పాటిదార్‌భవన్‌లో మహిళా మోర్చా ఆధ్వర్యంలో శక్తివందన్ అభియాన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై మాట్లాడారు. స్త్రీలు తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకొని తన శక్తి సామర్థ్యాలను ఆవిష్కరించుకోవడమే నిజమైన మహిళా సాధికారత అన్నారు. మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. స్త్రీలను గౌరవించడం మనదేశ గొప్పతనమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ శక్తి అభియాన్ ఇన్‌చార్జి ఆకుల విజయ, జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, మహిళా మోర్చా పార్లమెంట్ ఇన్‌చార్జి స్రవంతిరెడ్డి, నిజామాబాద్ పార్లమెంట్ కో-కన్వీనర్ భోగ శ్రావణి, అధ్యక్షురాలు ప్రవళిక, పల్లె గంగారెడ్డి, లక్ష్మీ నారాయణ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కందాల రాజగోపాలాచారికి స్వర్ణ కంకణ పురస్కారం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 4 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో ఉన్న శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో సర్ సీవీ రామన్ అకాడమీ (సేవా సాంస్కృతిక సంస్థ) ఆధ్వర్యంలో 28వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది సర్జ కంకణ పురస్కారాల సంబురాలు చేపట్టారు. పండితులు, విద్యావేత్తలతోపాటు వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిని సన్మానించారు. జ్యోతిష్య రంగంలో చేసిన కృషికి నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి గ్రామ పురోహితులైన కందాల రాజగోపాలాచారిని 'జ్యోతిష్య ప్రపూర్ణ' బిరుదుతోపాటు స్వర్ణ కంకణ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమాన్ని శ్రీమాన్ మహేంద్రనాథ్, శ్రీమాన్ చాముండేశ్వరి మహరాజ్, కర్ర వీరభద్రం, విద్యావేత్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి సాధు సమ్మేళనం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 4 : మండలకేంద్రంలోని ఎస్ఎల్‌జీ గార్డెన్‌లో ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు సాధు సమ్మేళనం నిర్వహించనున్నట్లు శ్రీవశిష్ట సంచార శత సత్సంగం సంస్థాపక అధ్యక్షుడు సచ్చిదానందగిరి స్వామి, ప్రధాన కార్యదర్శి రాములు, ఉపకార్యదర్శి భరత్‌భూషణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి సాధువులు అతిథులుగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. శత సత్సంగం చతుర్థ మహాసభలు, శ్రీమద్భగవద్గీత వేదాంత జ్ఞాన యజ్ఞం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

శ్రీశైలానికి పాదయాత్రగా తరలిన మాలధారులు

పాదయాత్రగా శ్రీశైలానికి వెళ్తున్న మాలధారులు

రుద్రూర్, ఫిబ్రవరి 4 : బోధన్‌లోని ఏకచక్రేశ్వరాలయం నుంచి శ్రీశైలానికి శివమాల ధారులు రుద్రూర్, బాన్సువాడ, పిట్లం మీదుగా శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లారు. రుద్రూర్ మండలకేంద్రంలో శివమాలధారులకు వీరభద్ర ఆలయంలో పాలు, పండ్లు అందజేశారు. బాన్సువాడ, పిట్లం మాలధారులు కూడా పాదయాత్రగా శ్రీశైలం వరకు పాదయాత్రగా వెళ్లనున్నట్లు మాలధారులు తెలిపారు.

స్నేహ సొసైటీ సాధారణ సమావేశం

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 4 : జిల్లాకేంద్రంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ ప్రధానకార్యాలయంలో స్నేహ సొసైటీ ప్రత్యేక సాధారణ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ మహిపాల్ హాజరై మాట్లాడారు. సొసైటీ నిర్వహిస్తున్న కార్యక్రమాలు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపును పొందడానికి ప్రధాన కారణం సొసైటీ సిబ్బంది అంకితభావంతో పనిచేయడమేనన్నారు. దివ్యాంగుల సంక్షేమం, హెచ్ఐవీ నివారణ, హింసకు గురైన మహిళల సంక్షేమం తదితర సేవలు సమాజానికి చాలా ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. సొసైటీ కోశాధికారిగా దీర్ఘకాలంగా పనిచేసి తీవ్ర అస్వస్థతకు గురైన గంగాధర్‌కు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ సవితారాణి, కార్యదర్శి సిద్ధయ్య, షేర్ల దయానంద్, శివప్రసన్న, వీరేశం, సుధాకర్, రమణారెడ్డి, సోమేశ్వర్, జ్యోతి, ఉమ, రాజేశ్వరి పాల్గొన్నారు.

జగదాద్రి ఆలయంతో యంచకు ఆధ్యాత్మిక శోభ

జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

యంచలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నవీపేట, ఫిబ్రవరి 4: గోదావరి తీరాన ఉన్న యంచ గ్రామంలో రూ. 3 కోట్ల వ్యయంతో శ్రీ ఓం జగదాద్రి దేవీ ఆలయం నిర్మించడంతో ఇక్కడ ఆధ్యాత్మిక శోభ విరాజిల్లుతున్నదని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని యంచ జగదాద్రి దేవి ఆలయ ఐదో వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఓం జగదాద్రి దేవీ ఆలయ ట్రస్టు వ్యవస్థకురాలు శ్రీ ఓం స్వర్ణకమల లక్ష్మి ప్రత్యేక చొరవతో గోదావరి ఒడ్డున ఆలయ నిర్మాణం చేపట్టడం శుభపరిణామమని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆలయం ఏర్పాటు చేయడం గర్వకారణమని ఆలయ వ్యవస్థకురాలిని అభినందించారు. ఆలయ వార్షికోత్సవాలు పది రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. వేడుకలు ముగింపు సందర్భంగా ఆదివారం ఆలయ ట్రస్టు వ్యవస్థాపకురాలు పూజలు నిర్వహించారు. శ్రీ ఓం పతాక ఆరోహణ చేశారు. ఆలయ ఉత్సవ విగ్రహాలకు గోదావరిలో స్నానం చేయించి గ్రామంలో ఊరేగించారు. వేద భారతి పీఠం వ్యవస్థాపకులు వేద విద్యానందగిరి స్వామి, భక్త బృందం, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చారు. కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్ లహరీ ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు మానికేశ్వర్‌రావు, మనోహర్ రావు తదితరులు పాల్గొన్నారు.

'మనశ్శాంతి కోవెల' నవల ఆవిష్కరణ

నవలను ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు, ప్రముఖ కవులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 4 : సామాజిక సేవకుడు మద్దుకూరి సాయిబాబు రచించిన 'మనశ్శాంతి కోవెల' నవల ఆవిష్కరణ కార్యక్రమం హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో నగరంలోని వంశీ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రభుత్వ పూర్వ కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు హాజరై నవలను ఆవిష్కరించి మాట్లాడారు. సాహిత్యం మానవత్వానికి దారి చూపుతుందని, మానవత్వం సాహిత్యానికి దోహదకారి అవుతుందని అన్నారు. 'సాహిత్యం - మానవత్వం' అంశంపై తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం కీలకోపన్యాసం చేశారు. కార్యక్రమంలో హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది గోపాల్‌శర్మ, ప్రముఖ కవయిత్రి అమృతలత, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్, నరాల సుధాకర్, కాసర్ల నరేశ్‌రావు, త్రివేణి, తిరుమల శ్రీనివాస్, కంకణాల రాజేశ్వర్, దారం గంగాధర్, సుమీలశర్మ తదితరులు పాల్గొన్నారు.

సాటాపూర్ సంతలో బైక్ చోరీ

ధర్మాబాద్‌లో విక్రయిస్తుండగా పట్టుకున్న పోలీసులు

రెంజల్, ఫిబ్రవరి 4: మండలంలోని సాటాపూర్ గ్రామంలో ప్రతి శనివారం జరిగే వారాంతపు సంతలో చోరీకి గురైన బైక్‌ను పోలీసులు ధర్మాబాద్‌లో స్వాధీనం చేసుకున్నారు. కందకుర్తి గ్రామానికి చెందిన యువకుడు శ్రీనివాస్ శనివారం బైక్‌ను పార్కు చేసి కూర గాయలను కొనుగోలు చేశాడు. తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. యువకుడు రెంజల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చోరీకి గురైన బైక్ మహారాష్ట్రలోని ధర్మాబాద్‌లో శనివారం రాత్రి విక్రయిస్తుండగా అక్కడి పోలీసులు రెండు బైక్ దొంగలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను ఆదివారం రెంజల్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. చోరీకి గురైన రెండు బైక్‌ల్లో ఒక బైక్‌ను మాత్రమే ధర్మాబాద్ పోలీసులు రెంజల్ పోలీసులకు అప్పగించారు. మరో బైక్‌పై ఫిర్యాదు చేయక పోవడంతో ధర్మాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండు బైక్‌లను విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను రెంజల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈవిషయమైన రెంజల్ ఎస్సై ఉదయ్‌కుమార్‌ను వివరణ కోరగా కందకుర్తి గ్రామానికి చెందిన యువకుడు అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని తెలిపారు. చోరీకి గురైన బైక్‌ను ధర్మాబాద్ నుంచి తీసుకువచ్చామని తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

టాలెంట్ టెస్ట్‌లో 'సత్యశోధక్' విద్యార్థుల ప్రతిభ

సిరికొండ, ఫిబ్రవరి 4 : జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబురాలు - 2023లో భాగంగా జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను శనివారం నిర్వహించారు. ఇందులో మండలంలోని సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల విభాగంలో ద్వితీయస్థానం సాధించారు. పాఠశాలకు చెందిన భార్గవ్‌రెడ్డి, యశస్విని, కృతిక ప్రతిభ కనబర్చారు. వీరికి జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, జేవీవీ జిల్లా ఇన్‌చార్జి చెలిమెల రాజేశ్వర్, ట్రస్మా పట్టణ అధ్యక్షుడు ధర్మరాజు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

వేల్పూర్‌లో వైద్యశిబిరం

వేల్పూర్, ఫిబ్రవరి 4: ఆర్మూర్‌లోని ఆశ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వీడీసీ అధ్యక్షుడు విజయ్ మాట్లాడుతూ వైద్యశిబిరం ఏర్పాటు చేసిన హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, వీడీసీ సభ్యులు, తాజా మాజీ సర్పంచ్ తీగెల రాధామోమన్, మాజీ ఉపసర్పంచ్ పిట్ల సత్యం, బీఆర్ఎస్ నాయకులు బబ్బురు ప్రతాప్, టైగర్ బాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విహారయాత్రకు విద్యార్థులు

సుభాష్‌గార్డెన్ వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

బాల్కొండ, ఫిబ్రవరి 4: మండలంలోని బస్సాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆదివారం విహార యాత్రకు వెళ్లినట్లు హెచ్ఎం రాజారాం తెలిపారు. మాక్లూర్ మండలం మదన్‌పల్లి గ్రామ పరిధిలోని సుభాష్‌గార్డెన్, డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం తదితర ప్రాంతాలను సందర్శించినట్లు తెలిపారు. విహారయాత్రలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని ఆయన పేర్కొన్నారు. విహారయాత్రలో ఉపాధ్యాయులు రాజేశ్వర్, బోయడ నర్సయ్య, శృతిమ, రంజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

కార్యక్రమంలో పాల్గొన్న 1987-88 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

మోస్రా (చందూర్), ఫిబ్రవరి 4 : మోస్రా మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1987-88 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 36 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపై కలవడంతో సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వారు చేస్తున్న ఉద్యోగాలు, కుటుంబీకుల వివరాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను కార్యక్రమానికి ఆహ్వానించి సన్మానాలు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి పిట్ల ఉమా శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★నిజామాబాద్‌లో పనిచేయుటకు LADY CARE TAKER కావలెను. భోజనం + వసతి సౌకర్యం + జీతం ఇవ్వబడును. సంప్రదించండి. ఫోన్ : 9154545433

NTZ-324515

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.

NT-319429

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/- ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

GST వర్తించును

సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



బీడీ దాస్‌ను సన్మానిస్తున్న నీలకంఠేశ్వర మున్నూరు కాపు సంఘం నాయకులు, వైద్యుడు విశాల్

సేవలకు గుర్తింపుగా డాక్టరేట్ పట్టా..

నవీపేట, ఫిబ్రవరి 4: ప్రముఖ వ్యాపార వేత్త, నిరంతర సామాజ సేవకుడు బీడీ దాస్‌కు ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేయడం అభినందనీయమని ప్రముఖ డాక్టర్ విశాల్ అభిప్రాయపడ్డారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నీలకంఠేశ్వర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో భవంతి దేవీదాస్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ విశాల్ హాజరై మాట్లాడారు. నవీపేట మండల కేంద్రానికి చెందిన భవంతి దేవిదాస్(బీడీ దాస్) తన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన భవంతి నారాయణ ట్రస్టు ఆధ్వర్యంలో సామాజిక సేవలతోపాటు అనాథలకు సేవలు అందించినట్లు గుర్తు చేశారు. బీడీదాస్‌ను నీలకంఠేశ్వర మున్నూరు సంఘం జిల్లా అధ్యక్షుడు సాయన్న, ప్రధాన కార్యదర్శి నర్సయ్య, ప్రముఖ వైద్యుడు విశాల్, సంఘం ప్రతినిధులు చల్ల రాజ్‌కుమార్, రాంచందర్, ప్రదీప్ సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- బోధన్, ఫిబ్రవరి 4: బ్లడ్ క్యాన్సర్ రోగుల కోసం బోధన్, బాన్సువాడ, నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానలకు వచ్చే పేద రోగుల అవసరాల కోసం సోమవారం బోధన్ పట్టణంలో మెగా రక్తదాన శిబిరం ఆరోగ్య జ్యోతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.
- బోధన్ రూరల్, ఫిబ్రవరి 4: బోధన్ మండలంలోని ఊట్‌పల్లి మల్లన్న స్వామి గుట్టపై ఆదివారం పద్మావతీ మల్లన్న ఆలయంలో గ్రామస్తులు పూజలు నిర్వహించారు.
- ఎడపల్లి, ఫిబ్రవరి 4: మండల కేంద్రంలో ఈనెల 19న నిర్వహించనున్న శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ శివాజీ విగ్రహ ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాస గృహంలో ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కందగట్ల రాంచందర్, శ్రీనివాస్, అక్కుణ్ గౌడ్, చేతన్ తదితరులు ఉన్నారు.
- భీమ్‌గల్, ఫిబ్రవరి 4: మండల కేంద్రంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గుట్టపై విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని 2024-26సంవత్సరానికి గానూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉప్పల నవీన్, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి వంశీకృష్ణ, కోశాధికారిగా కత్రోజి నర్సింహాచారి, ఉపాధ్యక్షుడిగా కోనేరు మహేశ్, సహ కార్యదర్శిగా రాగి భార్గవచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కందకుర్తి గోదావరిలో పూజలు

కందకుర్తి గోదావరి వద్ద తెప్పలు వదులుతున్న భక్తులు

రెంజల్, జనవరి 4: పుష్య మాసం చివరి ఆదివారం కావడంతో త్రివేణి సంగమ పుష్కర క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. మండలంలోని కందకుర్తి గోదావరినదిలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. గోదావరినదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. నదిలోని పురాతన శివాలయం వద్ద పిండి వంటలతో తయారు చేసిన తెప్పలను వదిలి మొక్కులు తీర్చుకున్నారు. శివాలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంచాయతీ పాలకవర్గానికి సన్మానం



భవానీపేట్‌లో పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న గ్రామస్తులు

బోధన్ రూరల్, ఫిబ్రవరి4: పదవీకాలం పూర్తయిన బోధన్ మండలంలోని భవానీపేట్ గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ పల్లెంపాటి కృష్ణకాంత్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు భవానిపేట్ శ్రీనివాస్, లక్ష్మణ్, మాగిరి పోశెట్టి, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

నందిపేట్, ఫిబ్రవరి 4: కుద్వాన్‌పూర్ గ్రామంలో ఆదివారం యువజన కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి కప్ క్రికెట్ టోర్నీని నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని టోర్నీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు పాల్గొన్నారు.

హంగర్గాఫారం ప్రత్యేకాధికారికి సన్మానం

కోటగిరి, ఫిబ్రవరి 4 : పోతంగల్ మండలం హంగర్గాఫారం ప్రత్యేకాధికారి ధన్‌రాజ్‌ను మాజీ సర్పంచ్ ఎజాజ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి నిర్మలతోపాటు వార్డుసభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి.. గ్రామంలోని సమస్యలను పరిష్కరించడంతోపాటు అభివృద్ధి చేస్తానని ప్రత్యేకాధికారి ధన్‌రాజ్ అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మండవ దిలీప్‌కుమార్, సాయిబాబా, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

గుడితండా పంచాయతీ పాలకవర్గానికి..

గుడితండా పాలకవర్గాన్ని సన్మానించిన గ్రామస్తులు

ధర్పల్లి, ఫిబ్రవరి 4 : సర్పంచుల పదవీకాలం ముగియడంతో మండలంలోని గుడితండా గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని తండావాసులు ఆదివారం ఘనంగా సన్మానించారు. తండా గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి సర్పంచ్ లింబ్యానాయక్, ఉపసర్పంచ్ ఎంజ్యాతోపాటు పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణను సన్మానించారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

కోటగిరి, ఫిబ్రవరి 4 : మండలంలోని ఎత్తొండ గ్రామంలో ఉన్న పునాది లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ 10వ వార్షికోత్సవాన్ని నేడు (సోమవారం) నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారికి అభిషేకం సహస్ర పుష్పార్చన, కుంకుమార్చన, గోమాత పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఆలయ ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేస్తామని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అద్వానీకి భారతరత్న అవార్డుపై సంబురాలు

ధర్పల్లి, ఫిబ్రవరి 4 : భారతదేశ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీకి దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న ఇచ్చి గౌరవించడాన్ని హర్షిస్తూ మండలంలోని బీజేపీ నాయకులు ఆదివారం సంబురాలు జరుపుకొన్నారు. మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద పటాకులు కాల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. దేశానికి నిస్వార్థంగా సేవలందించిన మహోన్నత వ్యక్తికి అవార్డును అందించిన కేంద్ర ప్రభుత్వానికి, పీఎం మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లోలం గంగారెడ్డి, నాయకులు రాజేందర్‌గౌడ్, పాల్తీ గంగాదాస్, చిలుక మహేశ్, మహిపాల్, నవీన్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'గావ్ చలో అభియాన్'

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 4 : బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు గావ్ చలో అభియాన్ (పల్లెకు పోదాం) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి తెలిపారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు శక్తి కేంద్ర ప్రముఖ్ నుంచి జాతీయస్థాయి అధ్యక్షుడి వరకు పల్లెల్లో, నగరాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బాల్కొండ, ఫిబ్రవరి 4: మండల కేంద్రంలోని వాటర్‌ప్లాంట్‌లో పేకాటాడుతున్న 8 మందిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.16,800 వసూలు చేశామని పేర్కొన్నారు. ఎవరైనా పేకాట ఆడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మున్నూరుకాపు సంఘం కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గ సభ్యులు

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 4 : పంచముఖి మున్నూరుకాపు సంఘం (షిర్డీ సాయినగర్, వినాయక్‌నగర్) నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హరిదాసు సాయిరెడ్డి, ప్రధానకార్యదర్శిగా కులాచారి సంతోష్, కోశాధికారిగా ఎల్యాల శంకర్‌ను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా.. ప్రధానకార్యదర్శి కోసం ఇద్దరు పోటీపడగా కులాచారి సంతోష్ తన ప్రత్యర్థిపై అత్యధిక ఓట్లు సాధించి గెలుపొందారు. సంఘం అభివృద్ధికి కృషిచేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది. రెండు సంవత్సరాల పాటు సేవలందించిన పూర్వ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి ఆమ లడ్డు శంకర్, వైసాక్షి సంతోష్, ఎల్యాల శంకర్‌ను నూతన కార్యవర్గం సన్మానించింది. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఇందల్వాయి, ఫిబ్రవరి 4: జీకే తండా గ్రామంలో సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి రూ. 10 వేల విరాళం అందజేశారు. నగదును తండా నాయకులకు ఆదివారం అందజేశారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి4: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి శివారులో యానం గుట్ట వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. జక్రాన్‌పల్లి మండలం తెర్లికొండ గ్రామానికి చెందిన మహివర్ధన్ బైక్‌పై తన స్నేహితుడితో కలిసి ఆర్మూర్ వైపు వస్తున్నాడు. వెనక నుంచి వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో మహివర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న మరో యువకుడికి గాయాలు కాగా దవాఖానకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. లారీ డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తవల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవి కుమార్ పేర్కొన్నారు.

చేపలు పట్టేందుకు వె